ఇంత దూరం పోస్టింగ్‌కి ఎందుకు ఒప్పుకున్నారండీ ! జీతం ఎక్కువ వస్తుంది గానీ మీరు ఊరువెళ్లాలంటే ఎంత ప్రయాణం? హాయిగా ఎలాగో ప్రయత్నించుకుని అక్కడే ఉండక, ఇక్కడ మీకు లైఫ్ ఏం ఉంది? శంభుముఖర్జీ అంటున్నాడు వేడి వేడి టీ చప్పరిస్తూ. అతను కలకత్తా నుంచి కొత్తగా వచ్చాడు షిల్లాంగ్‌కి. చుట్టూ ప్రకృతి సౌందర్యం ఆహ్లాదకరంగా ఉంది. కానీ ఎక్కడ షిల్లాంగ్ ఎక్కడ తెలుగుదేశం!

'మూడేళ్లు అయిపోతే వెళ్లిపోవచ్చులెండి. ఇంక జీవితంలో మళ్లీ ఎప్పుడూ ఇక్కడికి రానక్కరలేదు' జోక్ వేశానని అతను నవ్వాడు గానీ, ఉషకి గానీ, మోహన్‌కిగానీ నవ్వు రాలేదు. ఒకళ్ల మొహం ఒకళ్లు చూసుకున్నారు. మోహన్ తనకి తోచిన సమాధానం ఏదో చెప్తుంటే ఉష తలవంచుకుని లోపలికి వెళ్లిపోయింది.

'వచ్చే నెలలో మా డైరెక్టరు వస్తున్నారు. ఏమిటి ఇంకొక రెండేళ్లు ఉండి పోదామంటావా?' మోహన్ మాటలకి ఆలోచనల్లో ఉన్న ఉష ఉలిక్కిపడింది.'

'బాగానే ఉంది కదా ఇక్కడ. అలవాటయిపోయింది.' తిరిగి వెళ్లాలంటే భయంగానే ఉంది.

'చంటిపిల్లల్తో మరి చేసుకోగలవా?'

'అందరూ ఉండటం లేదూ? అలాగే మనమూ.' నసిగేసింది.




'ఏం చేస్తాం మరి. వీలయినన్ని రోజులు దూరంగా ఉండక తప్పేట్టు లేదు. వెళితే మళ్లీ గోల మొదలు నావల్ల కాదు. అయినా భార్గవ దగ్గర ఉంది కదా వాడూ పరాయివాడేం కాదు. లేకపోయినా వూళ్లో ఇల్లు ఉండనే ఉంది.!'

ఉష నిట్టూర్చింది. జరిగినదంతా తలచుకోవాలన్నా ఏదోలా ఉంటుంది. అలాంటి పరిస్థితులు కూడా వస్తాయని ఎప్పుడూ అనుకోలేదు. ఎవరితోనూ చెప్పకోడానికి లేదు.

* * * * *

కామాక్షి, మోహన్‌కి మూడో అన్న. మిగతా ఇద్దరు ఆడపిల్లల్లాగే తనకీ మంచి సంబంధం చేశారు. కుర్రాడు ఇంకా ఇంజనీరింగ్ చదువుతున్న సంబంధం తప్పిపోతుందేమోనని తొందరగా చేసేశారు. అత్తవారింట పెద్ద కుటుంబం. కామాక్షికి నలుగురిలో సందడిగా అక్కడే బాగుండేది. తీరా చదువు పూర్తయి తిరిగి వస్తాడనుకున్న భర్త గంగలో స్నానం చేస్తూ జారి మునిగిపోయాడు. మూడు రాత్రుల ముచ్చట తప్ప కామాక్షికి వేరే ఏ అనుభవమూ మిగలలేదు. కూతురు కష్టానికి కుమిలిపోతున్న సమయంలో కామాక్షి తల్లి గర్భవతి. మోహన్‌ని కన్నది. దానికోసం విచారించాలో, దీనికోసం ఆనందించాలో అర్థం కాలేదు. తమ్ముడ్ని చూసి మురిసిపోయింది కామాక్షి అంత దుఃఖంలోనూ వాడు కాస్త మనుషుల్ని గుర్తుపట్టే సమయానికి తల్లినీ, దండ్రినీ చూసి నవ్వులు ఒలకబోయడం, వాళ్లిద్దరూ మురిసిపోవడం - తనేదో పరాయిగా, ఒంటరిగా బాధపడింది కామాక్షి. అత్తవారింట్లోనే బాగుండేది నలుగురిలోనూ సందడిగా అని అక్కడికే వెళ్లిపోతానంది. అత్తగారు, మామగారు మంచివాళ్లే. 'ఇక్కడ ఉంటే ఆస్తిలో భాగం ఇస్తారో, లేదో దానికీ ఏదో ఆధారం కావాలి కదా' అని తండ్రి కూడా ఆలోచించి పంపించేశాడు.

నలుగురున్న ఆ ఇంట్లో కామాక్షి అవసరం ఎంతన్నా ఉండేది. పనికీ మనిషి కావాలి. రేప్రొద్దున ఆస్తులు పంచుకుంటే

ఎవళ్ల పిల్లనో ఒకర్ని అంటకట్టి ఆ ఆస్తి కలుపుకోవచ్చు. లేకపోతే ఏం చేసేస్తుందో అన్న ఆలోచన కూడా మరుదులు, బావగార్లకి ఉంది. మొత్తానికి ఎలాగయితేనేం పురుళ్లూ, పుణ్యాలు, పెళ్లిళ్లూ - అన్నింటికీ చాకిరీ చేసే అలవాటు అయిపోయింది. ఇంతా చేస్తే, సమయానికి 'కామాక్షీ నువ్వు కాస్త పక్కకి తప్పుకోమ్మా!' 'కామాక్షీ నువ్వు ఎదురుపడకమ్మా !' 'ఆ పళ్లెం నువ్వు ముట్టుకోకు' 'ఈ రోజు కాస్త చంటిదాన్ని నువ్వు ముట్టుకోకు.' అంటూ అంటరానిదానిలా దూరం నెట్టేసేవారు. కామాక్షికి ముళ్లకర్రతో పొడిచినట్టుండేది. తనకి జీవితంలో ముత్తయిదువుగా జరిగిన అనుభవాలెన్నని ? అసలా జీవితమే గుర్తులేదు. బొట్టు పెట్టుకున్న మొహం అసలు జ్ఞాపకమే లేదు. 'ఎవరూ తన వాళ్లు కాదు. తనకి ఎవరూ లేరు' అన్న నిర్లిప్తతతో, అసహనంగా రోజులు గడుపుతోంది.

మోహన్ పెద్దవాడయ్యాడు. తండ్రి పోతూ కామాక్షి బాధ్యత నీదే లంటూ చేతిలో చెయ్యి వేయించుకున్నాడు. కామాక్షి బావగారి కొడుకు భార్గవ, మోహన్ ఇద్దరూ ఇంజినీరింగ్ చదువుకున్నారు. వాళ్లకి వండిపెడుతూ, దగ్గర ఉందామని అనుకున్న కామాక్షికి హాస్టల్లో చేరిపోయేసరికి ఆ ఆశ కూడా పోయింది. మోహన్ చదువు పూర్తయి ఉద్యోగంలో చేరాడు. క్యాంపులు తిరిగే ఉద్యోగం కావడంతో ఒక గది తీసుకుని కాలక్షేపం చేశాడు. అక్కని తెచ్చుకుని ఇంక తన దగ్గర ఉంచేసుకోవాలని ఆశ. ఈ లోపల కామాక్షి మామగారు ఊళ్లో ఉన్న ఇల్లు, కొంత రొఖ్ఖం, ఆవిడ బంగారం అంతా ఇచ్చేశారు. అందరూ వేర్లు అయిపోయి చెల్లాచెదురయి పోవడంతో కామాక్షి ఊళ్లో ఉన్న తన ఇంటికి చేరుకుంది. కానీ అందరి కళ్లూ ఆవిడ డబ్బు మీదే ఉన్నాయి. కామాక్షి మాత్రం ఎవర్నీ పెంచుకోడానికి ఒప్పుకోలేదు. 'ఎవరో కన్న పిల్లల్ని తనెందుకు పెంచుకోవాలి? తన కేమిటి రక్తసంబంధం? డబ్బు కోసమే తప్ప వీళ్లకి తనమీద అభిమానం ఉందా?' అనుకుంది.

మోహన్ ఉద్యోగం మార్చుకుని అక్కని తీసుకొచ్చి సెటిల్ అయ్యాడు. ఇన్నాళ్లకి ఆవిడకి తనదంటూ ఒక స్థానం దొరికింది. అంతా ఆవిడ ఇష్టం. తన తమ్ముడు, తను.

## యూదు పురాణ కథ

పూర్వం ఒకానొక దేశంలో రాజుని ఎన్నుకోవడం దైవ నిర్ణయంగా భావించడం ఒక సాంప్రదాయంగా వస్తోంది. ఆనంద విహంగమనే ఒక అరుదైన విహంగాన్ని రాజు మరణించిన వెంటనే వదిలేవారు. ఆ పక్షి ఎవరి తలపైనైతే వాలుతుందో వారే ఆ దేశ రాజు.



# నౌకరు రాజయిన వేళ!

ఒకసారి పరి పాలిస్తున్న ఆ దేశ రాజు మరణించగా సాంప్రదాయ ప్రకారం వారు ఆనంద విహంగాన్ని వదిలారు. అది వెళ్లి ఒక బానిస తలపై వాలింది. ఆ బానిస ఈకల టోపి, గొర్రెపిల్ల వూలుతో తయారు చేసిన బెల్టు ధరించి వివాహ సందర్భాలలో నృత్యం చేస్తూ డోలు వాయించి పొట్ట పోసుకునేవాడు.

ఆ బానిస రాజు కాగానే రాజ గృహానికి సమీపంలోనే ఒక గుడిసెను నిర్మించమని ఆజ్ఞ జారీ చేసి, అందులో తన పూర్వ ఆస్తి అయిన ఈకల టోపి, గొర్రెపిల్ల వూలు బెల్టు, డోలు, ఒక అద్దం ఆ గుడిసెలో పెట్టించి భద్రపరిచాడు. అతని వింత ప్రవర్తనకు అతని మంత్రివర్గం విస్తుపోయి దీనికి అర్థం చెప్పమని అడిగి, ఒంటరిగా వున్నా సరే రాజరికపు మర్యాదని పాటించడం అతని విధి అని చివాట్లు వనాయి.

అప్పుడు రాజు "నేను రాజుని కాకమునుపు కేవలం ఒక బానిసని. అది నేను మరువకూడదు. అలా నేను మరువకుండా గుర్తుంచుకుంటేనే నేను మీకన్నా గొప్పవాడిననే భావం నాలో రాదు. ఆ భావం లేనప్పుడే నా మనసులో గర్వం ప్రవేశించదు" అని జవాబు ఇచ్చాడు.

'ఎందుకలా హైరానపడి పని చేస్తావు? రెస్టు తీసుకోకూడదా? ఇన్నాళ్లూ చేసి చేసి ఉన్నావు. ఇద్దరు మనుష్యులకి ఊర్కెనే తాపత్రయపడిపోతావు?' అని మోహన్ అంటే ,

'నా సొంతానికి అంటూ ఇప్పుడే కదా చేసుకుంటున్నాను. ఇన్నాళ్లూ వాళ్లకీ, వీళ్లకీ చెయ్యడమే. నాకేం తృప్తి మిగిలింది? ఇంక నీకు నేను, నాకు నువ్వు' అని నచ్చచెప్పేది.

పెళ్లి చేసుకోమంటూ కొన్నిరోజుల తర్వాత మొదలుపెట్టింది. సంబంధాలూ వస్తున్నాయి. రెండు, మూడు చూశాక ఉష సంబంధం నచ్చింది మోహన్‌కి. మధ్యతరగతి కుటుంబం, కష్టం, సుఖం తెలుసు. పెళ్లి చూపులయ్యాక, ఒంటరిగా తనతో మాట్లాడతానంటే సిగ్గుతో ముడుచుకుపోయింది ఉష.

'అక్కయ్య ఎపుడూ నాతోటే ఉంటుంది. ఆవిడ జీవితం అంతా ఒక ట్రాజడీ.

ముందుగా మీతో చెప్తే మంచిదని' అంటూ కామాక్షి గురించి వివరాలు చెప్తుంటే తెల్లబోయి చూసింది ఉష సిగ్గు సంగతి మర్చిపోయి.

'ఇదా తను ఏకాంతంలో కోరుకుంది?' అనుకుని, మళ్లీ సర్దుకుని 'మీకెంతో నాకూ అంతే ఆవిడ. అంత ప్రత్యేకం చెప్పాలా నాకు' అంది.

కాపురానికి వచ్చాక గానీ ఉషకి తెలియలేదు ఆరోజు అంత సులభంగా అనేసింది గానీ ఆచరణలో అంత తేలిక కాదని, ముందునుంచీ ఉషని దేన్లోనూ ఎక్కువగా జొరబడకుండా కట్టుదిట్టం చేసుకుంది కామాక్షి. అన్ని పనులూ ఆవిడే చేసుకునేది. ఉషకి ఏవో పై పనులు చెప్పడం తప్ప. లోకరీతి కోసం తమ్ముడ్ని పెళ్లి చేసుకోమంది గానీ ఉష తమ మధ్యకి అడ్డంగా వచ్చినట్టు ఉండేది ఆవిడకి.

ఉదయం మోహన్‌కి భోజనం ఆవిడే పెడుతుంది. రాత్రి ఆవిడ ఫలహారం చేస్తుంది. అది కూడా వీళ్ళు ఎపుడు తింటారో అప్పటి దాకా తినేది కాదు. కలిసి సరదాగా భోజనం చేద్దామన్న కోరిక తీరనే లేదు ఉషకి. ఎప్పుడో ఒక్కసారి సినిమాకు వెళ్లి హోటల్‌లో భోజనం చేస్తేనే ఆ సరదా. అది కూడా చాలా తక్కువ. ఇంటి దగ్గర ఆవిడ ఒక్కర్తీ ఉంటుందని. ఇంటికివచ్చాక హోటల్ భోజనాలు తింటే ఏం రోగాలు వస్తాయో, వాళ్లెంత అసహ్యంగా వండుతారో వర్ణించేది కడుపులో దంతా బయటికి వచ్చేటట్లుగా, ఎలాగో ధైర్యంచేసి ఉష కాఫీ మాత్రం గదిలోకి తీసుకుపోయి భర్తతో కబుర్లు చెపుతూ తాగేది. అక్కయ్య ఏమనుకుంటుందో అని మోహన్‌కి అనిపించినా, భార్య చిన్న కోరిక తీర్చడం తన బాధ్యత అన్నట్టుగా ఊర్కొనేవాడు. వేరే ఏమీ పని లేక ఉష పనిమనిషిని కూడా పెట్టుకోకుండా ఆ పనులన్నీ చేసుకొనేది. మధ్యాహ్నం మాత్రం తను చిన్నప్పట్నించీ ఎంత నిష్టగా, నిగ్రహంగా గడుపుతుందో చిలవలు, పలవలు, కల్పించి చెప్పేది. తనలాటి మొగుళ్లుపోయిన వాళ్లందరి కథలు కూడా ఉన్నవీ, లేనివీ, చెప్పేది. ఏడుపు మొహం వేసుకుని తప్పదన్నట్లు వినేది ఉష. రోజంతా పని చేసి మధ్యాహ్నం నిద్ర కూడా పోయేది కాదు ఆవిడ.



ఏదో విధంగా రోజులు గడుపుకొస్తున్న ఉషకి చెప్పుకోలేని బెడద ఒకటి వచ్చిపడింది. ఆరోజు రాత్రి 'ఒరేయ్! మోహనా, నిన్న రాత్రంతా గుండె దడ, నీరసం నిద్రరాలేదు. ఏమిటో భయం వేసింది. నిన్ను పిలిచానుగానీ పలకనేలేదు ఎవరూ' అంటూ ఒక నిష్ఠూరం వేసింది ఆవిడ. అంత ప్రమాదం ఏదీ జరిగి ఉండదనీ, ఆవిడ తనను పిలిచి ఉండదనీ అతనికి తెలుసు. అయినా ఆవిడ తృప్తి కోసం.

'ఇవాల్టికి పోనీ ఇక్కడే పడుకుంటానులే' అంటూ ఏవో మాత్రలు తెచ్చి ఇచ్చి అక్కడే పడుకున్నాడు. ఉష కూడా,

పాపం రోజంతా పని చేస్తారు, వద్దంటుంటే వినకుండా. నేను కాస్త సాయం చేస్తానన్నా వినరు అందుకే ఆ నీరసం అదీ అంది.నాలుగురోజులు అలాగే గడిచింది. ఆ మర్నాడు ఇంక మామూలుగా మోహన్ తన గదిలో పడుకున్నాడు.

'మీరా తలుపులు మూసుకుని పడుకుంటారు. పిలిచినా పలకరు' అని అంటే, లేదులేతీసే ఉంచుతాను. అని సర్ది చెప్పాడు మోహన్. కాస్సేపయ్యాక తలుపులు దగ్గరగా వేసేసరికి 'తలుపులు వేసేశావేమిటిరా మోహనా' అంటూ అరిచేది అయిదు నిమిషాలు కాకుండానే. ఆవిడ పడుకోలేదన్నమాట.

ఉషకి సిగ్గుతో ప్రాణం పోయినట్టయింది. 'ఇదేం బెడదండీ బాబూ!' ఊరుకోమన్నట్లు సైగ చేసి 'గాలికి పడిపోయినట్టుంది' అంటూ తీశాడు మళ్లీ. రోజు ఇదే తంతు. ఉషకి సంగతి అర్థమయింది. ఆవిడకి తామిద్దరు అలా కలిసి ఉండటం ఇష్టం లేదు. పగలంతా అంత అలసిపోతుంది, అయినా, రాత్రి నిద్రరాదా ఈవిడకి, వీళ్లేంచేస్తున్నారో అని గమనిస్తూనే ఉంటుంది.

'ఏమిటండీ! మరి అసహ్యంగా ఉంది. దొంగతనం చేస్తున్న వాళ్లలాగ తప్పు చేస్తున్న వాళ్ళలాగ ఈ కాపురం ఏమిటి? దేనికైనా సర్దుకుపోవచ్చుగాని యిదెలాగ? తలుపు తీసుకుని ఈ పడుకోడం ఆవిడ ఎక్కడ్నుంచో చూస్తుంటారంటే నాకు సిగ్గుగా ఉంది' అంది.

'ఆవిడ గురించి చెప్పాను గదా ఉషా! జీవితంలో ఆవిడ ఏమి అనుభవించలేదుగదా అవతలి వాళ్ళని చూస్తే అలా ఉంటుంది కాబోలు. ఆవిడకి ఉన్నది నేనొక్కడ్నికదా నాతోపాటు నీకూ తప్పదు మరి భర్త మాటలకి ఉషకి ఏడుపొచ్చింది.

'అదెలాగండీ రోజల్లా ఆవిడ్ని నేనే విషయంలోనన్నా ఏమన్నా అంటున్నానా? నాకూ ఆవిడ మీద జాలి వుంది. కాని రాత్రి పూట కూడా బతకనివ్వకపోతే ఎలాగ? అసలు అలాంటప్పుడు పెళ్ళెందుకు' చేసుకున్నారు? హాయిగా ఇద్దరూ ఉండాల్సింది, భార్య మాటలకి మోహన్‌కి కోపంరాలేదు. ఉష మనః స్థితి అతనికి అర్థమవుతోంది. అందుకే అలా మాట్లాడుతుంది.

'కొన్నాళ్ళు ఓపికపట్టు ఉషా! అలవాటయితే ఆవిడే మారుతుంది. ఏ తెల్లవారుఝామునో ఆవిడకి నిద్రపడుతుంది. అప్పుడు చక్కగా తలుపులు వేసేసుకుందాంలే!' అన్నాడు నవ్వుతూ సరదాగా. ఉషకి నవ్వురాలేదు. సరిగదా ఇంకా ఏడ్పు వచ్చింది. పరిష్కారంలేని సమస్యలా ఉంది.

'నన్ను ముట్టుకోకండి. రేపట్నుంచి మీరు కూడా ఆవిడ దగ్గరే పడుకోండి. నేను ఒక్కదాన్నీ ఈ గదిలో పడుకుంటాను. అంతేకాని తలుపులు బార్లా తీసుకొని...ఛీ! నాకు తల కొట్టేసినట్టుంటోంది. ఇంకెన్నాళ్ళో ఓపిక పట్టడం? నేను ముసలిదాన్నయిపోతాను. ఆ తరువాత ఇంకెక్కడ పడుకున్నా గొడవలేదు'

ఉష బిగుసుకుపోయింది.

తలుపులు తీసి ఉంటే ఉష క్రిందన అమడ దూరంలో పడుకునేది. మోహన్‌తో సరిగ్గా మాట కూడా మానేసింది. మోహన్‌కి కూడా అదోరకం నిర్లిప్తత, నిరుత్సాహం వచ్చేశాయి.

ఒకరోజు ఇద్దరూ కలిసి మోహన్ పై ఆఫీసర్ ఇంటి కెళ్ళారు. ఉషకి వాళ్ళతో ఏదో దూరపు చుట్టరికం కూడా కలిసింది. మోహన్ అంటే అతనికి ఆఫీసులో మంచి అభిప్రాయం ఉంది. ఆవిడ చనువుకొద్దీ ఉషని చూసి 'ఏమమ్మా క్రిందటిసారికన్నా బాగా చిక్కిపోయావు ఏమన్నా విశేషమా ఏమిటి?' అంది నవ్వుతూ.

విశేషం లాగే ఉంది బతుకు. మునుపు ఎవరో అత్తగారు కొడుకు, కోడలు మధ్య మంచం వేసుకుని పడుకునేది అని అంటే పడిపడి నవ్వింది. ఇప్పుడు అంతకన్నా అందంగాలేదు తన బతుకు. ఎవరితోటి మనసులో మాట చెప్పుకునే వీలులేకపోయింది ఇన్నాళ్లు. ఆవిడ అడిగిందే తడవుగా అన్ని ఏకరువు పెట్టేసింది. ఆఖర్న దుఃఖంతో గొంతుపూడుకుపోయింది.

అంతా విని ఆవిడ నిట్టూర్చి 'మోహన్ మాత్రం ఏం చేస్తాడు పాపం! ఉన్నదల్లా అతనొక్కడేకదా ఆవిడకి. అలాగని ఎన్నాళ్లు భరిస్తారు మీరు మాత్రం' అని భర్తవైపు తిరిగి 'పోనీ ఏదన్నా నీళ్లు నిప్పులు పుట్టని చోటికి వీళ్ళని బదిలీ చెయించయ్యకూడదూ. ఆవిడ అంత దూరం ఎలాగూ వెళ్లరు. ఎలాగో తంటాలు పడతారు' అంది హాస్యంగా.

మోహన్‌కి మాత్రం ఇంటి గుట్టంతా ఇలా బయటపెట్టుకోవడం చిన్నతనంగా వుంది. అయన కాస్సేపు ఆలోచించి షిల్లాంగులో ఒక పోస్టింగ్ ఖాళీ వుంది. నీవు వెళతానంటే వెళ్ళిపోవచ్చు. మరీ ఈవిడ చెప్పినంత అధ్వాన్నమైన స్థలం కాదు. గానీ దూరంకదా వర్షాలవి ఎక్కువ అంతే. కొంచెం ఇబ్బంది ఉంటుంది అంటుంటే.

'ఫరవాలేదండీ అందరూ ఉంటున్నారు కదా అక్కడ మాత్రం వెళ్ళిపోతాం' అంది కంగారుగా ఉష.

భార్య తొందర చూసి మోహన్‌కి జాలివేసింది. ఏమిటంటావోయ్ నువ్వు ? అని ఆఫీసర్‌గారు అడుగుతుంటే 'ఇంకా అనేదేమిటి వెళ్ళిపోతారండీ. ఆవిడ ఇంకా ఆరోగ్యంగానే ఉన్నారు గదా వండుకొని తినగలరు. వూళ్లో ఇల్లు ఉంది. కొన్నాళ్లు గడవనియ్యండి ఇలాగ చూద్దాం" అంటూ అయన భార్యే మోహన్ తరపున సమాధానం చెప్పింది. మోహన్ మౌనంగా తలవూపాడు. అక్కయ్యని వదిలించుకుని అలా వెళ్ళిపోవడం అతనికి బాధగా ఉంది కానీ వేరే దారి లేదు. కొన్నాళ్లు దూరంగా ఉంటే మనుషులు-మనసులు పరిస్థితులు కూడా మారుతాయేమో అని అతనికి ఆశ.

'అదేమిట్రా! హాయిగా పడి ఉంటున్న వాళ్లని తరిమెయ్యడానికి అంతకన్నా వేరే ఊరే దొరకలేదా? దేశం అంతా గొడ్డుపోయిందట్రా!' గోలపెట్టింది కామాక్షి.

'అలాకాదు అక్కయ్యా! ప్రతీ వాళ్లు అలాంటి చోటికి ఎప్పుడో ఒకప్పుడు వెళ్ల వలసిందే. అయితే నాకింత తొందరగా అవుతుందని అనుకోలేదు. వెళ్లక తప్పదు. ఎవర్నయినా పట్టుకుని తొందరగా రావటానికి ప్రయత్నిస్తాను. మళ్లీ ఇటువైపుకి' అని నచ్చచెప్పాడు బాధపడుతూనే.



## కాశ్యప్ దర్శకత్వంలో రాకేష్ - సుధ

పి.ఆర్.ఒ. నుంచి చిత్ర దర్శకుడిగా మారిన కేవల్ పి. కాశ్యప్ 11 సంవత్సరాల తర్వాత మళ్లీ 'హీరోంకే ఘర్ చోర్' అనే టి.వి. సీరియల్ ద్వారా వెలుగులోకి వస్తున్నారు.

కామెడీ నటుడు రాకేష్ బేదీ - 'మయూరి' ఫేం సుధాచంద్రన్ ఈ సీరియల్‌లో నటిస్తున్నారు. దూరదర్శన్ ఈ సీరియల్ ప్రసారం చేసేందుకు పరిశీలిస్తోందట. కాశ్యప్‌కథ, స్క్రీన్ ప్లేలో తయారవుతున్న ఈ ధారావాహికం ఆయన దర్శకత్వ ప్రతిభకు మరో గీటురాయిగా చెప్పుకుంటున్నారు.

1978లో 'చోరీ చోరీ' అనే చిత్రాన్ని నిర్మించిన కాశ్యప్ 'మేరే దేశ్‌కీ ధర్తీ' చిత్రాన్ని సంకల్పించాడు కాని ఆ సంకల్పం నెరవేరలేదు.

సతీష్‌కౌల్, రాకేష్‌పాండే మొదలైనవారుకూడా ఈ సీరియల్‌లో నటిస్తున్నారట.

సణుక్కుంటూనే ఊళ్లో ఉన్న అన్న ఇంటికి వెళ్లిపోయింది. ఆ వెళ్లడం మళ్లీ ఏడాదిన్నర తరువాత గాని ఇటువైపు రాలేదు ఇద్దరూ. అప్పుడే మోహన్‌కి భార్గవ కనిపించాడు.

అంతదూరం వెళ్లిపోయావేమిట్రా! ఆఫీసర్ తెలిసినవాడే కదా ఆ మాత్రం పలుకుబడి ఉపయోగించుకుని ఇక్కడే ఉండ లేకపోయావా? పిన్ని మరీ ఒంటరిది అయిపోయింది. నీ దగ్గర వుండాలని ఎంత ఆశపడింది? ఆ వూళ్లో ఒంటరిగా వుండాల్సి వస్తోంది అంటూ నిష్ఠూరంగా మాట్లాడాడు.

అతనికి ఏం సమాధానం చెప్పలేక పోయాడు. ఏదో అర్థమైనట్టు నవ్వాడు భార్గవ. మామూలు గొడవలే భార్యకీ అక్కకి సరిపడి ఉండదు. వీడు భార్య మాటకి ఎదురు చెప్పలేకపోయాడు.

నువ్వా అంతేనా? ఆ మాత్రం మీ ఆవిడ్ని కంట్రోల్ చేయలేకపోయావా? పిన్నిని అలా వదిలేసి కావాలని అంత దూరం వెళ్లిపోయావన్నమాట.

భార్గవ మాటలకి కొంచెం కోపం వచ్చింది మోహన్‌కి. నువ్వుమాత్రం పరాయివాడివా కాస్త చూడకూడదూ? అని అందామనుకున్నాడు కాని మాట మాట, పెరుగుతుందని వూరుకున్నాడు.

షిల్లాంగు తిరిగి వచ్చిన కొన్నాళ్లకి భార్గవ దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. మొన్న ఆ మధ్య ఊరికి వెళ్లి పిన్నిని చూశాను ఒంటరిగా ఉంది పావం, జాలేసి తీసుకువచ్చాను. మా ఆవిడ కూడా మళ్లీ ఎక్స్‌పెక్ట్ చేస్తుంది. మొదట రెండు సార్లు అబార్షన్ అయి వీక్‌గా ఉంది. భయపడు తోంది. బెడ్ రెస్ట్ కావాలి. వంట మనిషి పెడతానన్నా అంతా పిన్నే చేస్తోంది విన కుండా తనని మంచం దిగనివ్వడం లేదు. ఆవిడకి పాపం కాలక్షేపంగా ఉంది. ఈ వయస్సులో ఆవిడకి మాత్రం ఏం కావాలి? కాస్త అభిమానం తప్ప. కాస్త చూసి చూడనట్టు మనమే అలవాటు చేసుకో వాలి అంటూ.

తమ్ముడివి నువ్వు వదిలించేసుకున్నా నేను తెచ్చి దగ్గరగా పెట్టుకున్నాను అన్న శ్లేష ఉంది ఆ మాటల్లో. ఉత్తరం చది విన ఉష

'అన్నేసి రోజులు ఎవరు వచ్చి ఉంటారు? అందుకని ఆవిడని తెచ్చుకుని దగ్గర పెట్టుకుని ఏవో కబుర్లు వ్రాశారు' అన్నది కొంచెం కినుకగా. మోహన్‌కి అదే అనిపించింది. చాకిరీ ఆవిడకేమి కొత్త కాదు ఎంతన్నా చేస్తుంది భార్గవ్‌మాత్రం పరాయివాడేమిటి? అనుకుని సర్ది చెప్పు కున్నాడు. కామాక్షికి ఎవరికీ ఉత్తరాలు వ్రాసే అలవాటు లేదు. మోహన్ ఎప్పు డన్న రాసిపడేస్తుంటాడు.

*** **** *** ****

చూస్తుండగానే రెండున్నర ఏళ్లు అయి పోయింది అక్కడికి వచ్చి. ఉష ఇప్పుడు ఐదవనెల గర్భవతి. దూరాభారమని ఇప్పుడే పురిటికి వెళ్లిపోతోంది.


'ఇలా వచ్చేసాం కాబట్టి సరిపోయింది గాని లేకపోతే ఎవరో ఒకరం పిచ్చాస్పత్రిలో చేరాల్సి వచ్చేది.' అనుకుంటూ ఉంటాడు మోహన్. మామూలు బదిలీ అయితే ఆ వూరు చూసి విసుక్కునేవారేమో కాని అవసరం కొద్దీ రావడంతో అసలా ప్రసక్తే రాలేదు.

ఆరోజు ఆఫీసు నుంచి వస్తూ ఉష చేతిలో ఒక ఉత్తరం పెట్టాడు. కాఫీ కప్పు అందించి ఉత్తరం విప్పింది. భార్గవ రాశాడు. చదువుకున్న కొద్దీ మొహంలో రంగులు మారాయి.

పిన్ని విషయంలో నిన్ను ఏవో మాటలు అన్నాను సారీ. అప్పటి నీ పరిస్థితి ఏమిటో అనుభవిస్తేనేగాని తెలి యలేదు. అందుకనే తనదాకా వస్తేనే గాని తెలియదంటారు. అనవసరంగా ఎవర్నీ ఏమీ అనకూడదు. ప్రమీలకి డెలివరీ ఇక్కడే చేశాను. కదపడం ఇష్టం లేక. ఏమాట కామాట చెప్పుకోవాలి. పిన్ని పావం చాలా చేసింది. తర్వాతే మొదలయింది అసలు గొడవ. కొన్నాళ్లు పిల్లవాడిని అసలు ఎవ రికి ఇవ్వకుండా కదిలేదికాదు. మొత్తానికి ఎలాగయితేనేంవాడ్ని లాక్కునేసరికి కొన్నాళ్లు పట్టింది. ఆ తర్వాత మమ్మల్నిద్దర్నీ కలిసి భోంచెయ్యనివ్వదు, మాట్లాడుకోని వ్వదు. ఇంకెందుకులే అన్నీ రాయడం నీకు తెలిసినవే. ఒంటరిగా వుండడం తప్ప ఇంకా ఆవిడ్ని ఎవరం భరించలేం. ఆ పల్లెటూళ్లో పడి ఉండవలిసిందే. కాలో, చెయ్యో స్వాధీనం తప్పి ఎవరి మీదన్న ఆధారపడిపోయే పరిస్థితి వస్తే తప్ప ఆవిడ్ని అలాగ వదిలెయ్యవలసిందే. ఎలా ఆవిడ్ని వదిలించుకున్నామో ఆ భగవంతుడికే తెలి యాలి. మళ్లీ పల్లెటూరు వెళ్లిపోయింది, అలా సాగింది ఉత్తరం.

మనమేదో ఈ రెండు మూడే ళ్లలో కాస్త మారుతుందేమో అనుకున్నాం ఇంకెందుకులే ఆలోచన. మా డైరెక్టర్‌తో చెప్పి ఇంకో రెండు మూడేళ్లు ఇక్కడే ఉండిపోదాం అన్నాడు మోహన్. కాఫీ కప్పు బల్లమీద పెడుతూ.

'వద్దండీ మనం వెళ్లిపోదాం. ఏదన్నా మంచి వూరు వేయించుకోండి మీ అక్క య్యని మన దగ్గరికి తెచ్చేసుకుందాం' ఉష మాటలకి చురుక్కుమన్నట్టుగా తల ఎత్తాడు మోహన్. ఉష కళ్లనిండా నీళ్లు.



# టి. వి.లో థెరెసా బైబిల్ కథలు



ఫిబ్రవరిలో టి. వి. ప్రేక్షకులకు నవోదయ ప్రొడక్షన్స్ వాళ్ళు అందచేస్తున్న 'బైబిల్ స్టోరీస్'లో మదర్ థెరెసా మనకు కనిపిస్తారట.

అనారోగ్యంగా వున్నప్పటికీ ఆమె ఈ సీరియల్ నిర్మాణానికి సహకరిస్తున్నారట. డాక్టర్ల సలహాలను కూడా ఈమె పట్టించుకోవటం లేదట. టెన్ కమాండ్మెంట్స్‌నుంచి కూడా ఈమె కొన్ని కథలను ఉదహరిస్తారట.

అనారోగ్య పరిస్థితుల్లో కూడా యింత మంచి కార్యానికి పూనుకుంటున్న థెరెసా భక్తి ప్రపత్తులు కొనియాడదగినవి. ఈ కార్యక్రమం విజయవంత మవ్వాలని ఆశిద్దాం!

---

ఏమైంది ఉషా? ఏమిటి మాట్లాడుతున్నావు? ఆ కన్నీళ్లు ఏమిటి.

'కళ్ళు తుడుచుకుని మీరీ ఉత్తరం చదివితే ఏమి అనిపించడంలేదా' అంది.

'ఎందుకనిపించడంలేదు? అందరిచేత తను అలా మాటలు పడుతుంటే అనిపించకుండా ఎలాగుంటుంది?' బాధగా అన్నాడు మోహన్.

అందుకే. మనం వెళ్లిపోదామండీ! ఇంకా ఆవిడకి ఆ అవసరం రాదు. మన దగ్గరే ఉంటారు ఏమైనాసరే.

'ఆలోచించే మాట్లాడుతున్నావా ఉషా. ఇప్పుడిలాగ దూరంగా ఉన్నాం కాబట్టి ఫరవాలేదు.

సర్దుకు పోవచ్చు అనిపిస్తుంది కానీ అక్కడికి వెళ్లాక మళ్లీ మొదలే. చదివావు గదా వుత్తరం. మళ్లీ మళ్లీ ఇలాంటి వూళ్లు వెయ్యమంటే ఎక్కువజీతం వస్తుందని కక్కుర్తిపడుతున్నాం అనుకుంటారు. నా వల్లకాదు' అన్నాడు విసుగ్గా.

'ఏం ఫరవాలేదు నేను చూసుకుంటాను అంటున్నాను కదా అప్పుడు మరీ చిన్నతనం, తెలియనితనం, ఈ రెండు మూడేళ్లలో మానసికంగాకూడా కొంచెం ఎదిగానేమో. అవన్నీ తలుచుకుంటే ఏమిటో సిగ్గుగా వుంటుంది. తప్పుచేసినట్టుగా వుంటుంది.'

'ఇప్పుడు అలాగే అంటావు రేపొద్దున పిల్లనో, పిల్లాడినో రోజంతా ఆవిడే పట్టుకుని వదలదు. నాకు పిల్లనసలు ఇవ్వడంలేదు అంటూ గోలపెడ్తావు. పిల్లతోపాటు నిన్నూ ఆవిడదగ్గరే పడుకోమంటుంది. ఇదేం గోలండీ రాత్రిపూట కూడా ఇలా ప్రాణంతీస్తే ఎలాగని నన్ను నువ్వు ప్రాణంతీస్తావు. అన్ని అనుభవాలు అయ్యాయిగదా.'

తనేదో అన్నీ కావాలని చేసినట్టు భర్త అలా అంటుంటే ఉషకి కొంచెం చివుక్కుమంది గానీ, సంభాళించుకుని 'నేను మాట ఇస్తున్నాను కదా దేనిమీదా కంప్లెయింట్ చెయ్యను. సరేనా!' అంది నమ్మకంగా

'ఇంక ముందు ఏం జరుగుతుందిరా భగవంతుడా?' అనుకున్నాడు మోహన్. ఉషకి మాత్రం నిజంగానే ఆ ఉత్తరం చూసిన దగ్గరనుంచీ బాధగా వుంది. ఎందుకు ఆవిడ అలా ప్రవర్తిస్తుందో? ఎందరి చేతా మాటలు పడుతుందో? అటువంటి మనిషికోసం కాస్త త్యాగం చెయ్యవలసి వచ్చినా ఫరవాలేదు. జీవితంలో ఏమిటి అనుభవించింది కనుక. అనుకుంది.

** ** ** **

'ఒరే మోహనా! పెద్దది అచ్చు అమ్మ పోలికరా? అమ్మ పేరు పెట్టాల్సిందే'. హడావిడి అంతా కామాక్షిదే.

ఐదోనెలనే ఉషకి డాక్టరు కవలలు ఉన్నారని చెప్పింది. అలాగే ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు, మోహన్‌కి. ముద్దులాగా వున్న ఆ రోజుల పిల్లలలో పోలికలు ఏం తెలియడంలేదు. అసలే ఒక్కసారే ఇద్దరు ఆడపిల్లలంటే నీరసం వచ్చేసింది. కానీ కామాక్షికి ఇవేవీ పట్టినట్టులేదు. ఆవిడ హడావిడి ఆవిడదే! బారసాలకని ఇద్దరూ వచ్చారు. వచ్చిన దగ్గరనుంచీ ఇద్దర్నీ ఒళ్లో వేసుకుని ఒకటే మురిసిపోతోంది.

ఆవిడ మాటలో కూడా ఎంతో మార్పు కనిపిస్తోంది. ఉషని చూస్తేనే అదోలా మారిపోయే ఆవిడ ఎంతో ఆప్యాయంగా, 'నువ్వలా తిరగెయ్యకమ్మా. ఎన్నాళ్లైందని? పచ్చిఒళ్లు, ఇద్దరు పిల్లల్ని కనడం మాటలేంటి? నువ్వలా కూర్చో నేను చూసుకుంటాను.' అంటూ వున్న నాలుగురోజులూ ఇంట్లో ఎవర్నీకూడా పిల్లలమీద చెయ్యి వెయ్యనివ్వలేదు.

'ఇదేమిటే. ఒక్కనిమిషం కూడా పిల్లల్ని వదలదు నీ దగ్గిరికి కూడా రానివ్వదు.' తన తల్లి మాటలకి ఉష వూరుకోమని మందలించింది. ఆడపడుచుని గమనిస్తున్న ఉషకి ఏవో ఆలోచనలు వస్తున్నాయి.

'మూడోనెల్లోనే పంపించెయ్యండమ్మా. ఏం ఫరవాలేదు నేనున్నాను కదా. చూసుకుంటాను మీ అమ్మాయికి ఏమీ ఇబ్బంది వుండదు.' అని ఖచ్చితంగా చెప్పేసింది.

వెళ్తూ, వెళ్తూ, 'ఐదోనెలదాకా ఉండిపొమ్మంటే ఉండిపోకు. వచ్చేసెయ్యమ్మా. వెళ్తున్నానేకాని నా మనసంతా వీళ్లమీదే వుంటుంది.' అని మరీ మరీ చెప్పి వెళ్లింది ఉష.

అలాగే తల్లికి నచ్చచెప్పి పిల్లల్ని తీసుకుని తల్లితో మూడో నెలనే వచ్చేసింది. ఇంక చూడాలి కామాక్షి హడావుడి. పొద్దునే లేచి పూజా, వంట ఎలాగ కానిస్తుందో గానీ ఇట్టే అయిపోతాయి. అప్పటి దాక ఉష పిల్లల్ని చూసుకుంటుంది. ఇంక అంతే! ఆ తర్వాత రోజంతా ఆవిడే. నీళ్లు, పాలూ, బట్టలు మార్చడం అన్నీను. పిల్లలు పాడు చేసిన గుడ్డలు కూడా ఆవిడే ఉతికేది.


'అదేమిటండీ! అవన్నీ మీకెందుకు? పనిమనిషిని పెట్టుకుందాం.' అని ఉష అంటే,

'ఇంకా నయం. వాళ్లు విసుక్కుంటారు ఒక రెండు గుడ్డలు ఎక్కువ పడితే. పిల్లల కడుపు పాడవుతుంది. అలా విసుక్కుంటే,' అని తీసిపారేసేది.

'ఎంతయినా ఇద్దరు పిల్లలవి ఉతకడం అంటే....'

'అస్తమానం అలా ఇద్దరు, ఇద్దరూ అనకు ఊర్కే, దిష్టి తగులుతుంది. జంట లక్ష్మలు వాళ్ళిద్దరూ. అలాగే చూసుకోవాలి. వాడయితే మరీను ఒకసారే ఇద్దరు ఆడపిల్లలు అంటూ, ఈసారలా అనద్దని గట్టిగా చెప్పు, ఇంకా ఆవిడ ధోరణికి అడ్డులేదు.

తల్లి నాలుగురోజులు ఉండి వెళ్లిపోయింది. ఉషకి నెమ్మదిగా కామాక్షి మనస్తత్వం అర్థం అవుతోంది కొంచెం కొంచెంగా. మోహన్ వరండాలో పచార్లు చేస్తున్నాడు. పిల్లలు గదిలో నిద్రపోతున్నారు. ఉష ఫ్లాస్కుల్లో నీళ్లు పోసుకుంటోంది. రాత్రి కావలసి వస్తాయని




పిల్లల గుడ్డలు మడత బెడుతోంది కామాక్షి పూర్తిగా ఆరిపోయాయో లేదో ఒకటికి రెండు మూడుసార్లు చూసి.

షిల్లాంగ్ నుంచి రావడం అయితే వచ్చేశాడు గానీ మోహన్‌కి మనసులో భయంగానే ఉంది, రోజులు ఎలా మారతాయో అని. పిల్లలకోసమో, పడకల కోసమో దెబ్బలాటలు తప్పవని. 'ఎందుకయినా మంచిది తనివాళ ముందు గదిలోనే పడుకుంటాడు. వాళ్లిద్దరూ ఏం చేసుకుంటారో?' అనుకున్నాడు.

లోపలికి వచ్చి కామాక్షి గుర్రుపెడుతూ నిద్రపోవడం చూసి ఆశ్చర్యపోయాడు. 'అదేమిటి? అక్కయ్య తన గదిలోకి వెళ్ళి ఎపుడు పడుకుంది? అప్పుడే నిద్రపోయిందా?' అన్నాడు.

'ఆ అన్ని పనులూ అయిపోయాయి. కాస్సేపు పోయి పడుకుంటాను. పిల్లలు గానీ లేస్తే లేపించు. నిద్రపట్టదులే నాకు, నేనే వస్తాను అంటూ వెళ్లిపోయారు. నిద్రపట్టేసిందన్నమాట. 'అంది ఉష.

రాత్రంతా దొర్లుతూ, తమిద్దర్నీ గమనిస్తూ ఉండే అక్కయ్య అంతలా ఎలా పడుకుండిపోయిందో అర్థం కాలేదు మోహన్‌కి.

'ఏం మంత్రం వేశావోయ్? అక్కయ్య అలా మారిపోయింది. ఇవాళేనా లేకపోతే......'

మోహన్ మాటల్ని మధ్యలోనే ఆపేస్తూ 'మంత్రం లేదు, తంత్రం లేదు, చిన్న సైకలాజికల్ ట్రీట్‌మెంట్ అంతే' అంది నవ్వుతూ.

'నువ్వు సైకాలజీ ఎప్పుడు నేర్చుకున్నావు' అన్నాడు హాస్యంగా.

'నేర్చుకోనక్కర్లేదు. అనుభవం నేర్పిస్తుంది. ప్రతీ మనిషికీ 'తనది' 'తనవాళ్లు' అన్న భావన ఉంటేనే రోజు ఆనందంగా గడుస్తుంది. ముఖ్యంగా ఆడవాళ్లకి మరీను. భర్త, పిల్లలు ఉంటే వాళ్లమీద తన ప్రేమ, ఆప్యాయత అంతా ఒలకబోస్తేనే తృప్తిగా ఉంటుంది. పిల్లలు లేకపోయినా పోనీ, భర్తన్నా ఉంటే ఒకళ్లకి ఒకళ్లూ ఉంటారు. ఆవిడ కి పాపం ఏదీ లేదు. మరింక అలా తయారవక ఎలా అవుతారు చెప్పండి. ఆవిడలో అసంతృప్తి పేరుకుపోయింది. అందరూ చాకిరీకి ఉపయోగించుకున్నారు. ఆస్తికోసం పిల్లల్ని ఇస్తామన్నారే గానీ ఆప్యాయంగా ఎవరూ చేరదీయలేదు. వాళ్లకేం పట్టింది? పోనీ మీరన్నా ఆవిడకి దగ్గరవుతున్నారనుకుంటే నేనొచ్చి లాక్కున్నాను. ఇంక ఆవిడకి తృప్తి ఏది? సొంత వాళ్లం మనం కాకపోతే ఇంక ఎవరు ఆదుకుంటారు? అందుకనే ఆవిడని బాగా గమనించి, నేను పిల్లల్నిద్దర్నీ ఆవిడ మీద వదిలేశాను పూర్తిగా. పగలంతా వాళ్లతో తృప్తిగా మనసుదీరా గడుపుతారు. అంతే. రాత్రి హాయిగా కళ్ల నిండా నిద్రపోతారు. ఇప్పుడింక ఏ బెంగా ఉండదు ఆవిడకి. ఎవరెక్కడ పడుకుంటున్నారో కూడా ఆవిడకి అక్కర్లేదు. మీరే చూస్తారుగా ఇంక ముందు. ఎంతసేపూ ఈ మనిషి ఎందుకిలా ప్రవర్తిస్తుంది అని గోల పెట్టుకున్నామే తప్ప ఆవిడ మనసులోకి తొంగి చూసేందుకు ప్రయత్నించనే లేదు. ఇదిగో వీళ్ల మూలంగానే అది కుదిరింది. ఒకళ్లకి ఇద్దర్ని ఇచ్చి భగవంతుడు కూడా మనకి సాయపడ్డాడు, అని గొంతు తగ్గించి, "ఇంకొక మాట చెప్పనా? పొద్దున నాతో వాడు ఆడపిల్లలో, ఆడపిల్లలో అని గోలపెట్టేస్తున్నాడు, వాడికొక మగపిల్లాడిని కనిపారెయ్యమ్మా మళ్లీ ఏడాదికి, పెంచుకుంటాడు. అన్నారు" అంది కొంచెం సిగ్గుపడుతూ, మురిపెంగా.

ఎంతో అనుభవం ఉన్నదానిలా, ఆరిందాలా ఉన్న భార్యని చూసి ముచ్చటగా దగ్గరకి తీసుకోబోయాడు, 'అయితే మనకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసిందన్నమాట' అంటూ.

కీచుమంటూ లేచింది ఒక పిల్ల. నేనూ ఉన్నానంటూ రెండోది లేచింది. 'చూస్తూ ఉండండి ఇద్దర్నీ. పాలుకలిపి తెస్తాను.' అంటూ లేస్తున్న ఉషని చూసి, 'బాగుంది ఇంక వీళ్లు సెన్సారింగ్ మొదలేమిటి మనకి... సరసం మాట దేవుడెరుగు. నిద్ర కూడా పోనిచ్చేటట్టు లేరు వీళ్లు, రాత్రంతా. పొండమ్మా నేను మా అక్కయ్య దగ్గరపోయి పడుకుంటాను. మీరు ముగ్గురు ఇక్కడే ఉండండి, రాత్రంతా జాగారం చేస్తూ' అన్నాడు పిల్లల్ని దగ్గరకి తీసుకుంటూ.

'నీకింతే కావాలిలే' అన్నట్టు ఇద్దరూ నవ్వారు ఏదో అర్థమయినట్టు ఒక్కసారే.

●